మున్సిపల్ వాహనాలను వినియోగించుకోవాలి

చేర్యాల, సెప్టెంబర్ 23 : మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో నిత్యం ఇంటి నుంచి వెలువడే తడి, పొడి చెత్తను అరుబయట పడవేయకుండా మున్సిపల్ వాహనాల్లో వేయాలని చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి కోరారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో తడి, పొడి చెత్త వేరు చేసే కార్యక్రమంతో పాటు పరిసరాలను పరిశుభ్రతపై ప్రజలకు మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. చెత్తను ఖాళీ ప్రదేశాల్లో డ్రైనేజీల్లో వేయకుండా వాహనాల్లో వేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కమిషనర్ నాగేందర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ,

చేర్యాలలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణిశ్రీధర్‌రెడ్డి

వార్డు అధికారులు, శానిటేషన్ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని నిరసన

చేర్యాల/గజ్వేల్, సెప్టెంబర్ 23 : బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ డిమాండ్ చేశారు. పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కార్మికులతో కలిసి బ్లాక్‌డే నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. పట్టణ కన్వీనర్ రాళ్ల బండి భాస్కర్, మున్సిపల్ వర్కర్స్ ప్రతినిధులు కనుకవ్వ, భాగ్య, మహేందర్, యాదగిరి, శేఖర్, అనిల్, రాజు, నాగరాజు, భిక్షపతి, అనిల్ పాల్గొన్నారు. కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ

చేర్యాలలో బ్లాక్ డే నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తా లో కార్మికుల నిరసనలో పాల్గొని మా ట్లాడారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గజ్వేల్, సెప్టెంబర్ 23 : పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మండల పరిధిలోని బూరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009-10 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 14 ఏండ్ల తర్వాత కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం పూర్వ ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు మల్లేశం, గౌరిశంకర్, నర్సింహులు, ప్రభాకర్, శ్రీనివాస్, బాలకిషన్, శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు.

తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిని శిక్షించాలి

గజ్వేల్, సెప్టెంబర్ 23: తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిని వెంటనే శిక్షించాలని కోరుతూ సోమవారం గజ్వేల్ పట్టణంలో హైందవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ తీసిన అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో సీఐ సైదాకు వినతి పత్రం అందజేశారు. పురోహితులు రాజశేఖర శర్మ, శ్రీనివాసచార్యులు, హైందవలు బుక్క రమేశ్, గోలి సంతోష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సీఐ సైదాకు వినతిపత్రం అందజేస్తున్న హైందవులు

పరారీలో ఉన్న గంజాయి కేసు నిందితుడు అరెస్టు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 23 : ఈ నెల 10న సమోదైన గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని సోమవారం పట్టుకున్నట్లు సిద్దిపేట త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన ప్రణయ్ గంజాయి సేవించడంతో పాటు సరఫరా చేస్తున్నాడన్న సమాచారం మేరకు మిట్టపల్లి గ్రామానికి సిబ్బందితో కలిసి నిందితుడిని పట్టుకొని విచారించారు. నిందితుడి వద్ద రూ. 700 విలువ గల 21.52 గ్రాముల నిషేధిత గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. మరో నిందుతుడు పరారీలో ఉన్నాడని త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు.

మహ్మదాపూర్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

హుస్నాబాద్, సెప్టెంబర్ 23 : హుస్నాబాద్ మండలంలోని హుస్నాబాద్-మహ్మదాపూర్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్ర య్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వారు గుంతలమయమైన రోడ్డును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం కోసం స్వయాన మంత్రి పొన్నం ప్రభాకర్ ఏడు నెలల క్రితం శంకుస్థాపన చేశారని, ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రెండున్నర కోట్ల నిధులతో నిర్మాణం చేయాల్సిన ఈ రోడ్డు పనులు ప్రారంభం కాక పోవడంతో మహ్మదాపూర్‌తో పాటు పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు లక్ష్మణ్, జేరిపోతుల సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించిన ఎంఈవో

నంగునూరు, సెప్టెంబర్ 23 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలను మండల పరిధిలోని మగ్ధూంపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల విద్యాధికారి దేశిరెడ్డి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు సుధాకర్, రామస్వామిగౌడ్, రమేశ్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అండర్ 19 ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించిన డీఈవో

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 23 : సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలను ఒక స్ఫూర్తిగా తీసుకొని ఆడాలని.. ఆటల వల్ల శారీరకంగా మానసికంగా ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, చిన్నకోడూర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా ఇన్‌చార్జి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 23 : రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు రూ. 500 గ్యాస్‌ను అందించనున్నది. దీనిలో భాగంగా సోమవారం కుకునూరుపల్లి మండలంలోని కోనాయిపల్లిలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి వారికి మాజీ సర్పంచ్ మిట్టపల్లి రుషి ఆధ్వర్యంలో ఇంటికి వెళ్లి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ,

కోనాయపల్లిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ రుషి

ఫీల్డ్ అసిస్టెంట్ రామస్వామి నాయకులు ఉన్నారు.

దేవాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చేర్యాల, సెప్టెంబర్ 23 : రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలైన యాదగిరిగుట్ట, వేములవాడ, బాసర, కొండగట్టు, భద్రాచలం, కొమురవెల్లి 6ఏ టెంపుల్స్‌లో విధులు నిర్వహిస్తున్న అర్చకులు, ఉద్యోగులు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మల్లికార్జున స్వామి వారి దేవస్థాన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. సోమవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి దేవాలయంలోని అతిథి గృహంలో అర్చకులు, ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న వేములవాడలో దేవాలయాల జేఏసీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎస్. విజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు బి.నవీన్, సంయుక్త కార్యదర్శి ఎం.భాస్కర్, కోశాధికారి ఎం. రవితో పాటు ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

దుబ్బాక, సెప్టెంబర్ 23 : ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం దుబ్బాక పట్టణంలో మెప్మా (స్వయం సహాయక సంఘాల) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో ప్లాస్టిక్ ఒకటని, దీని నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. దుబ్బాక పట్టణంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమన్నారు. దుబ్బాకను ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ వైస్‌చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్, మెప్మా సీవో రేణుక, కౌన్సిలర్లు ఆస యాదగిరి, శ్రీనివాస్, కనకయ్య, బీఆర్ఎస్ నాయకులు రొట్టే రాజమౌళి, ఎల్లారెడ్డి, భూంరెడ్డి, కిషన్‌రెడ్డి, రామస్వామి, చం ద్రయ్య, మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్‌సీలు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పక్కన రాష్ట్ర ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

కార్యవర్గాన్ని సన్మానించిన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక పట్టణంలో ఇటీవల ఎన్నికైన పద్మశాలీ కుల సంఘం నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన జిందం గాలయ్యతో పాటు ఉపాధ్యక్షుడు ఎల్లప్ప, ప్రధాన కార్యదర్శి రమేశ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులు క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగాలి

మిరుదొడ్డి, సెప్టెంబర్ 23 : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు విద్యా రంగంలో రాణిస్తూ క్రీడల్లో జాతీయ స్థాయికి ఎదగాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం మిరుదొడ్డి టౌన్‌లో నైపుణ్య ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ (అండర్ 14-17) విభాగాల క్రీడలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. నైపుణ్య ఆర్గనైజేషన్ సంస్థ జిల్లా అధ్యక్షుడు మొగుల్ల ఐలయ్య, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, ఎంఈవో ప్రభుదాస్, మాజీ వైస్ ఎంపీపీ పోలీసులు రాజులు, మా జీ సర్పంచ్‌లు రాములు, బాల్‌రాజు, మాజీ ఎంపీటీసీలు స్వామి, బైరయ్య, నర్సింహులు, నాయకులు అంజిరెడ్డి, రాజేశం, దేవరాజు, లింగం, పాల్గొన్నారు.

నెహ్రూ పార్కును సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేట, సెప్టెంబర్ 23 : మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కృషి ఫలితంగానే నెహ్రూ పార్కు సుందరీకరణ, ఓపెన్ జిమ్ ఏర్పాటు అయ్యిందని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు అన్నారు. సిద్దిపేట పట్టణంలో రూ. 35 లక్షల నిధులతో సుందరీకరణ చేసిన నెహ్రూ పార్కును కౌన్సిలర్ జయ వెంకటరెడ్డితో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జంగిటి కనకరాజు, బీఆర్ఎస్

నెహ్రూ పార్కును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులా రాజనర్సు

నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టడంలో ప్రభుత్వం విఫలం : ఎస్ఎఫ్ఐ

హుస్నాబాద్, సెప్టెంబర్ 23 : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం లేదని, నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షుడు గుగులోతు లక్ష్మణ్ ఆరోపించారు. సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని పలు ఎస్టీ వసతి గృహాలను ఆయన సందర్శించి భోజన నాణ్యతను పరిశీలించారు. నాయకులు తిరుపతి నాయక్, అనిల్, దినేశ్, సురేశ్ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

హుస్నాబాద్, సెప్టెంబర్ 23 : వంట నూనెల ధరలు పెరుగుతున్నాయనే వార్తలు రావడంతోనే హుస్నాబాద్ పట్టణం సహా పలు ప్రాంతాల్లోని వ్యాపారులు ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయాలు జరుపుతున్నారని, వీరిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో ఇప్పటికే కొందరు వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని, వీరి గోదాములు, దుకాణాలపై దాడులు చేసి నిల్వలను బయటకు తీయాలని జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 15 నుంచి 32 శాతం దిగుమతి సుంకాన్ని పెంచిన వెంటనే వ్యాపారులు ఒక్కో నూనె ప్యాకెట్‌పై రూ. 30 నుంచి రూ. 40 అదనంగా తీసుకుంటూ నూనెలను విక్రయిస్తున్నారని ఆరోపించారు. బీఎస్పీ నాయకులు ఎలగందుల శంకర్, వేల్పుల రాజు తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 23 : కొండపాక మండలంలోని బందారం గ్రామంలో విజయ డెయిరీ పాలకవర్గాన్ని రద్దు చేయాలని పాడి రైతులు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామంలో పాడి రైతులు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ విజయ డైరీ చైర్మన్ రామచంద్రం అవకతవకలకు పాల్పడుతుండని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రోజులుగా పాల విషయంలో లీటర్‌పై రెండు యూనిట్లు తేడా రావడంతో ఇతర ప్రైవేటు డెయిరీలో పాలు పోశారు. దీంతో ప్రైవేటు డెయిరీలో రెండు యూనిట్లు ఎక్కువగా రావడంతో విజయడైరీలో జరుగుతున్న మోసాలను ఆధారాలతో సహా సోమవారం సంబంధిత మండల సూపర్‌వైజర్

సమావేశంలో చర్చించుకుంటున్న పాడి రైతులు

సుమన్ దృష్టికి తీసుకుపోవడంతో పాటు విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాడి రైతులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఉచితంగా డెంగీ, మలేరియా నివారణ మందుల పంపిణీ

సిద్దిపేట, సెప్టెంబర్ 23 : రోగం వచ్చాక తీసుకునే చికిత్స కంటే రోగం రాకముందే నివారణ మార్గాలు పాటించడం ఎంతో మేళని ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ఖాళీ ప్రసాద్‌రావు అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విజయ హోమియో క్లినిక్ ఎదుట డాక్టర్ ఖాళీ ప్రసాదరావు ఉచితంగా డెంగీ, మలేరియా నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాళీ ప్రసాద్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో కూడా ఉచితంగా మందులు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని, సంస్థల యాజమాన్యాలు తమను సంప్రదించవచ్చునని తెలిపారు.

ముస్త్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

చేర్యాల, సెప్టెంబర్ 23 : చేర్యాల మండలంలోని ముస్త్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం మెటర్నల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు పూర్తిచేయాలన్నారు. డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మైమున సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను నిండా ముంచిన ప్రభుత్వం

■ సర్కార్‌పై రైతు సమాఖ్య సంఘాల ఆగ్రహం

సిద్దిపేట టౌన్, సెప్టెంబర్ 23 : కాంగ్రెస్ సర్కార్ పచ్చి అబద్ధాలతో అధికారంలోకి వచ్చి రైతులను,ప్రజలను నిండా ముంచిందని తెలంగాణ రైతు సమాఖ్య సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు గడీల భైరవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం సిద్దిపేటలో సోమవారం రైతు సంఘాల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భైరవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నమ్మించిందని ఆరోపించారు. అధికారంలోకి రాగానే రైతులకు పరిమితులు, అంక్షలను పెట్టి రైతుల ఉసురు పోసుకుంటున్నారని మండిపడ్డారు. రైతు సంఘాల నేతలు శ్రీరాంరెడ్డి, రామచంద్రరావు, రంగారెడ్డి, రాజేంద్రప్రసాద్, కరుణాకర్‌రెడ్డి,ఈశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎల్లారెడ్డి,భూపతిరెడ్డి,మాల్లారెడ్డి, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గడీల భైరవరెడ్డి

తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి

మద్దూరు(ధూళిమిట్ట),సెప్టెంబర్ 23 : తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాడిశెట్టి రామాంజనేయులు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలుగు యూనివర్సిటీ పేరును మార్చేందుకు చేస్తున్న యత్నాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశం మెచ్చిన పోరాటయోధుడు పొట్టిశ్రీరాములు అని, అటువంటి వ్యక్తి పేరును మార్చి అవమానించవద్దన్నారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని హెచ్చరించారు.

జగదేవపూర్‌లో..

జగదేవపూర్, సెప్టెంబర్ 23 : హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును తీసివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుద్దచిన్న సత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

దౌల్తాబాద్‌లో పారిశుధ్య పనులు ముమ్మరం

రాయపోల్, సెప్టెంబర్ 23 : దౌల్తాబాద్ మండల కేంద్రంలో పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా ఉండడంతో పాటు బైపాస్ రోడ్డుపై వెళ్లాలంటే కంపు..కంపు..అంటూ వార్త 'నమస్తే తెలంగాణ' పత్రికలో ఆదివారం వచ్చిన వార్తకు స్పందించిన మండల అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు సోమవారం ఉదయం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనులు పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉండడంతో మండల అధికారులు యుద్ధప్రతిపాదికన దిద్దుబాటు చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌తో చెత్త చెదారాలను తొలిగించారు. మండల కేంద్రంలోని ప్రధాన విధులో మురుగు కాల్వాలను పరిశుభ్రం చేశారు. దౌల్తాబాద్ మండల కేంద్రం ఒక ప్పుడు అదర్శ మండలంగా పేరు ఉండేదని

పారిశుధ్య పనులు చేపడుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

కాని ప్రస్తుతం అధికారులు, నాయకుల మధ్య సమన్వయం లేక పోవడంతో పారిశుధ్యంతో పాటు అభివృద్ధి పనులు కుంటుపడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, మండల నాయకులు, స్థానిక నాయకులు సమన్వయంతో ముందుకు సాగులని ప్రజలు కోరుకుంటున్నారు.

దుద్దెడ ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

కొండపాక(కుకునూరుపల్లి), సెప్టెంబర్ 23 : కొండపాక మండలంలోని దుద్దెడలోలోని ఆర్ఎంపీ ఆంజనేయులు ప్రథమ చికిత్స కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు సోమవారం వైద్యాధికారులు సీజ్ చేశారు. ఇటీవల ఆర్ఎంపీ ఆంజనేయులు చేసిన వైద్యంతో అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహిళ అనారోగ్యానికి గురైందని వచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టిన మండల వైద్యాధికారి శ్రీధర్ సోమవారం డిప్టిక్ రిజిస్ట్రేషన్ అధారిటీ సభ్యులతో కలిసి విచారణ చేపట్టిన సదరు ఆర్ఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి శ్రీధర్ మాట్లాడుతూ ఆర్ఎంపీ వైద్యుడు చేసిన వైద్యంతో అంకిరెడ్డిపల్లికి చెందిన మహేశ్వరి అనారోగ్యానికి గురైందని వచ్చిన ఫిర్యాదుతో ప్రాథమిక విచారణ చేపట్టి జిల్లా వైద్యాధికారికి నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. కొండపాక పీహెచ్‌సీ హెచ్‌ఈవో రమణ, డిప్టిక్ రిజిస్ట్రేషన్ సభ్యులు రాజు, అనిల్ తదితరులు ఉన్నారు.

దుద్దెడలో ఆర్ఎంపీ ఆంజనేయులు ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేసిన వైద్యాధికారులు

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హౌస్ అరెస్టు

చేర్యాల, సెప్టెంబర్ 23 : గాంధీ దవాఖానతో సహా రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానలో నెలకొన్న సమస్యలను అధ్యాయనం చేసేందుకు బీఆర్ఎస్ నిజనిర్ధారణ కమిటీని నియమించింది. సర్కారు దవాఖానలకు బీఆర్ఎస్ నియమించిన నిజనిర్ధారణ కమిటీతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు హాజరుకాకుండా ఉండాలని కాంగ్రెస్ సర్కారు ముఖ్య నేతలను హౌస్ అరెస్ట్ చేసింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే పల్లాను హైదరాబాద్‌లోని ఆయన నివాసం నుంచి బయటకు రాకుండా ఉండేందుకు పోలీసులు ఉదయాన్నే హౌస్ అరెస్టు చేశారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ గాంధీ దవాఖానకు కమిటీని వెళ్లకుండా ఎందుకు అడ్డుకుంటున్నారో సమాధానం ఇవ్వాలని, వాస్తవాలను ప్రభుత్వం ఎందుకు దాస్తున్నదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ సర్కారు నిర్బంధం కొనసాగించడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

నష్టపరిహారం ఇవ్వనిదే భూములివ్వలేం

ఆందోళన చేస్తున్న భూనిర్వాసితులు

వర్గల్, సెప్టెంబర్ 23 : అన్నంపెట్టే భూములిచ్చాం, మా నోటికాడి బుక్కను దానం చేసినం. మాకు ఇంటిస్థలాల సర్టిఫికెట్లు, ఉపాధికోల్పోయిన కుటుంబాల్లో ఇంటికో ఉద్యోగం చూపించిన తర్వాతనే మా భూములు తీసుకోవాలని వర్గల్ మండలం అవుసులోనిపల్లి, వర్గల్, రామక్కపేట, నగరంతాండ గ్రామాలకు చెందిన భూ నిర్వాసితులు సోమవారం రోడ్డెక్కారు. భూనిర్వాసితులకు ఎలాంటి సరైన నష్టపరిహారం చేయకముందే టీజీఐఐసీలో భాగంగా భూములు కేటాయించిన సదరు కంపెనీదారులు తమకు పూర్తి న్యాయం చేయకముందే నిర్మాణాలు చేపట్టడంపై తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. భూనిర్వాసిత గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

రాయలసీమ ఫ్యాక్షన్‌ను తలపిస్తున్న రేవంత్ పాలన

■ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

వొడితెల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, సెప్టెంబర్ 23 : తెలంగాణలో రేవంత్‌రెడ్డి రాయలసీమ ఫ్యాక్షన్‌ను తలపించేలా పాలన చేస్తున్నాడని, విపక్ష ఎమ్మెల్యేలను టార్గెట్ చేసి వారి ఇండ్లపై దాడులకు తెగబడుతూ అక్రమ అర